ఉస్మానియా ఆస్పత్రిలో పెయిన్ క్లినిక్ ప్రారంభం


పెయిన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో పెయిన్ క్లినిక్‌ను డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నొప్పి నివారణకు అధునాతన, మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని తెలిపారు. ప్రవాస భారతీయ వైద్యులు, సహ దాతల సహకారంతో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహే తదితరులు పాల్గొన్నారు.


రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ చేసిన పిల్లలతో నిమ్స్ వైద్య బృందం

నిమ్స్‌లో ఇద్దరు బాలురకు అరుదైన చికిత్స

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండె దడతో వచ్చిన ఇద్దరు బాలురకు నిమ్స్ వైద్యులు అరుదైన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఇద్దరు బాలురకు సుప్రావెంట్రిక్యులర్ అరిథ్మియాలకు సంక్లిష్ట రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ (ఆర్ఎఎఫ్ఎ) ప్రక్రియను నిర్వహించినట్లు వివరించారు. వివరాలను నిమ్స్ సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఓరుగంటి సాయి సతీష్ వివరించారు. ఖమ్మంకు చెందిన 15 ఏళ్ల బాలుడు చిన్నప్పటి నుంచి తరుచూ దడతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ బాలుడిని ఇటీవల నిమ్స్‌కు తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అతనికి కుడి వైపు గుండె ఉన్నట్లు, థొరాక్స్, ఉదరంలోని ప్రధాన అవయవాలు వ్యతిరేక దిశలో ఉన్నట్లు గుర్తించారు. వక్రీకరించిన గుండె శరీర నిర్మాణ శాస్త్రం, చిన్న వయసు, కాథెటర్లను ఉంచడంలో ఇబ్బంది, దడకు కారణమయ్యే అసాధారణ బహుళ విద్యుత్ సర్క్యూట్ల వివరణ సవాళ్లను 3డీ ఈ మ్యాపింగ్ సహాయంతో అధిగమించారు. వక్రీభవన దడకు కారణమయ్యే మరొక సర్క్యూట్‌తో పాటు అసాధారణ అదనపు విద్యుత్ మార్గం ఆర్ఎఫ్ శక్తితో విజయవంతంగా తొలగించినట్లు ఆయన వివరించారు.

నాలుగు నెలల్లో 25 సార్లు గుండె దడ

నగరానికి చెందిన మరో 14 ఏళ్ల బాలుడు నాలుగు నెలల్లో 25 సార్లకు పైగా గుండె దడతో అస్వస్థతకు గురయ్యాడు. పలు ఆస్పత్రులను సందర్శించిన తర్వాత అతను ఇటీవల నిమ్స్‌కు వచ్చాడు. ఆ బాలుడిని పరీక్షించిన వైద్యులు మిట్రల్ వాల్వ్ దగ్గర గుండె ఎడమ వైపు అసాధారణమైన అదనపు విద్యుత్ ఉత్పత్తి చేసే సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీనిని 3డీ మ్యాపింగ్ సహాయంతో, దృష్టి రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్‌తో తొలగించినట్లు చెప్పారు. ప్రక్రియ తర్వాత ఇద్దరు బాలురు గుండె దడ నుంచి పూర్తిగా విముక్తి పొందారని, ఈ వైద్య ప్రక్రియ ఉచితంగా నిర్వహించామని డాక్టర్ సాయి సతీష్ తెలిపారు. ఈ వైద్య ప్రక్రియలో డాక్టర్ హేమంత్, డాక్టర్ సునీత, డాక్టర్ అజేయ, డాక్టర్ మౌనిక, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అనురాగ్, క్యాత్ ల్యాబ్ టెక్నీషియన్లు ప్రమీల, రామారావు, నర్సింగ్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ ఉన్నారు.

కిమ్స్‌లో 35ఏళ్ల మహిళకు..


కోలుకున్న మహిళతో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు

రాయదుర్గం, మే 17 (ఆంధ్రజ్యోతి): థైరాయిడ్ వాపు వల్ల గుండె, ఊపిరితిత్తులు, ప్రధాన రక్తనాళాలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న 35ఏళ్ల మహిళకు కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. కిమ్స్ ఆస్పత్రి థోరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. 35ఏళ్ల మహిళ ఊపిరి అందక ఇబ్బంది పడుతుండడంతో కుటుంబసభ్యులు ఇటీవల కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారని తెలిపారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమెకు చాలా కాలంగా థైరాయిడ్ వాపు సమస్య ఉందని, అది క్రమంగా మెడ నుంచి కిందకి వెళ్లి ఎద భాగాన్ని ఆక్రమించిందని గుర్తించామని తెలిపారు. కుడివైపు ఊపిరితిత్తులు, గుండె, ప్రధాన రక్తనాళాన్ని ఆక్రమిస్తూ రెట్రోస్టెర్నల్ గాయిటర్‌గా రూపొందిందని గుర్తించామని ఆయన పేర్కొన్నారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నైపుణ్యంతో 15సెంటీమీటర్ల పొడవున్న కణితిని తొలగించామని వివరంచారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని వారం రోజుల తర్వాత డిచార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు.

వైద్య చికిత్సలో అల్ట్రాసౌండ్ కీలకం


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్ర జ్యోతి): అత్యవసర వైద్య చికిత్సలో అల్ట్రాసౌండ్ పరికరం కీలకంగా మారిందని కేర్ హాస్పిటల్స్ అసోసియేట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్ వర్మ కె పేర్కొన్నారు. కేర్ ఆస్పత్రి బంజారాహిల్స్ ఆధ్వర్యంలో, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా (ఎస్ఈఎంఐ) ఆధ్వర్యంలో శనివారం జాతీయ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్ (ఎన్‌యూఎల్ఎస్) వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్‌పై వైద్యులకు శిక్షణ ఇస్తున్నామని, దీని వల్ల వారిలో నైపుణ్యం పెరుగుతుందని వివరించారు. సెమీ అకడమిక్ చెయిర్ డాక్టర్ శ్రీనత్ కుమార్ టీఎస్ మాట్లాడారు. ట్రామా, కార్డియాక్ అరెస్ట్, షాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్లను త్వరగా అంచనా వేసేందుకు అవసరమైన అల్ట్రాసౌండ్ సాంకేతికతలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో సెమీ బోర్డు అధ్యక్షురాలు డాక్టర్ సౌజన్య పట్టిబండ్ల, దేశవ్యాప్తంగా ఉన్న ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వార్డులో రోగులకు తిరిగే స్వేచ్ఛ

- జైలు శాఖ నియంత్రణలో ఖైదీ రోగులకు భద్రత
- మానసిక చికిత్సాలయం సూపరింటెండెంట్ డాక్టర్ అనిత

హైదరాబాద్ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): మానసిక చికిత్సాలయంలో కుటుంబ వార్డులలోని రోగులకు స్వేచ్ఛగా తిరిగే హక్కు ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు. కొన్నిసార్లు వారు ఆస్పత్రి ప్రాంగణాన్ని వదిలివెళ్తారని, ఆ సమయంలో రోగులు కుటుంబసభ్యుల కస్టడీ నుంచి తప్పించుకుంటారని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురించిన 'మానసిక చికిత్సాలయం నుంచి నిత్యం రోగులు మాయం' కథనానికి ఆమె స్పందించారు. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 ప్రకారం, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు కనీస నియంత్రణతో చికిత్స చేయాలని, అందుకే, కుటుంబ వార్డుల వ్యవస్థ ఉందన్నారు. ఇక్కడ కుటుంబసభ్యులు రోగిని జాగ్రత్తగా చూసుకోవడానికి వారితో పాటు ఉండటానికి అనుమతిస్తారని తెలిపారు. జైలు రోగుల కోసం ప్రత్యేకంగా ఒక భవనం ఉందని, వారి పర్యవేక్షణ, భద్రత జైలు శాఖ నియంత్రణలో ఉంటుందని వివరించారు. దూకుడుగా ఉండే రోగులను, న్యాయాధికారులు, పోలీసులు సూచించిన రోగులను మాత్రమే క్లోజ్ వార్డులో ఉంచుతామని ఆమె తెలిపారు.

వర్షపు నీరు ఇంకించాల్సిందే..!

- ప్రతీ నీటిబొట్టు భూమిలోకి ఇంకేలా చర్యలు
- ఇంకుడు గుంతలకు సై అంటున్న కాలనీ, బస్తీవాసులు
- జలమండలి పర్యవేక్షణలో జోరుగా నిర్మాణాలు

బంజారాహిల్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రం కాకముందే నీటి కొరత మొదలైంది. ఎక్కువ ప్రాంతాల్లో బోరింగ్‌లలో నీరు అడుగంటి పోయాయి. దీంతో వాటర్‌ట్యాంకర్ల మీద ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగరంలో నిత్యావసరాలకు నీరు తగ్గిపోవడంతో అన్నింటికి మంచినీటి పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. నీరు ఇంకేందుకు దారి లేకుండా పోతుంది. ఈ తరుణంలో ఇంకుడు గుంతలు ఎంతో దోహదం చేస్తాయని ప్రభుత్వం, జలమండలి అధికారులు చెబుతున్నారు. నీరు ఎంతో అమూల్యమైనది. ప్రతీ నీటి బొట్టును వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. లీకేజీలను అరికడుతూనే వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేందుకు చర్యలు చేపట్టాలి. అందుకోసం ప్రభుత్వం గానీ, జలమండలిగానీ నిధులు ఇవ్వదు. కాలనీల సొసైటీలు, సంక్షేమ సంఘాల వారితో మాట్లాడి ఇంకుడు గుంతలు తవ్వించే బాధ్యత మీదేనంటూ ఇటీవల జలమండలి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు సంజీవరెడ్డినగర్ డివిజన్ పరిధిలోని 13 సెక్షన్‌లలో నిరుపయోగంగా ఉన్న ఇంకుడు గుంతలకు మరమ్మతులు మొదలు పెట్టారు. అంతే గాకుండా ఇంకుడు గుంతల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

ఇంకుడు గుంత ఏర్పాటు చేయాల్సిందే..!

భావి తరాలకు భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఉండేందుకు జలమండలి చేస్తున్న ప్రయత్నంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరుతున్నారు. ముఖ్యంగా కొత్తగా ఏర్పడుతున్న కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలపై దృష్టి సారించారు. కొత్తగా నల్లా కనెక్షన్ కావాలంటే మీ కాలనీలో తప్పనిసరిగా ఏదో ఒక ప్రాంతంలో ఇంకుడుగుంతను తవ్వించాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం వల్ల ఆయా ప్రాంతంలో కురిసిన వర్షపు నీరంతా అందులోకి చేరడం వల్ల భవిష్యత్తులో మీరు ఉంటున్న చోట నీటి జలాలు పుష్కలంగా ఉంటాయని చెబుతున్నారు. ఇక పార్కులు, క్రీడా మైదానాల్లో కూడా ఏర్పాటు చేసుకోవచ్చంటున్నారు. ముఖ్యంగా విద్యాసంస్థలు నడుపుతున్న వారు కూడా ఆయా ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మిస్తే అక్కడే నీరు అంతా భూమిలోకి ఇంకుతుందని, దీనివల్ల పరిసర ప్రాంతాల్లో నీటి లభ్యత ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, తట్టిఖానా పరిధిలో అనేక కాలనీలు, బస్తీలు ఉన్నాయి. ఎమ్మెల్యే కాలనీ, గౌరీశంకర్‌కాలనీ, ఎన్‌బీటీనగర్, ఫిలింనగర్ బస్తీలు, జూబ్లీహిల్స్‌లోని అన్ని కాలనీల్లో కమ్యూనిటీ హాళ్లు, కార్పొరేట్‌తోపాటు ప్రైవేట్ స్కూళ్ల ప్రాంగణాల్లో ఎత్తు పల్లాలను చూసుకొని ఇంకుడు గుంతలను తవ్వించాలని జలమండలి అధికారులు భావిస్తున్నారు. ఎల్లారెడ్డిగూడ పరిధిలోని ఖాళీ ప్రదేశాలను జలమండలి అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో స్థానికుల సహకారంతో గుంతలు తవ్వేందుకు ఏర్పాట్లు చేశారు.


కాలనీల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు

స్వచ్ఛందంగా ముందుకు..

నీటి ఆవశ్యకతను గుర్తించిన అనేక కాలనీల సంక్షేమ సంఘాలు ఇంకుడు గుంతలు తవ్వించేందుకు ముందుకు వస్తున్నారు. తమ సొంత డబ్బుతో నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని కాలనీ సంక్షేమ సంఘాలు బోరింగ్ ఉన్న ప్రాంతంలో వరదనీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. వీటి నిర్మాణం వల్ల వేసవిలో బోరింగ్ ఎండిపోకుండా నిరంతరం నీరు వస్తుందని చెప్పారు. ఇక కొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలో పిట్‌లను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటికే ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. ఎవరైనా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలంటే వారికి సలహాలు, సూచనలు అందించేందుకు జలమండలి అధికారులు టెక్నీషియన్‌లను అందుబాటులో ఉంచారు. ఉచితంగానే వీరు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసే ప్రాంతాలకు వెళ్లి ఎక్కడ తవ్వాలి.. ఎలా ఉండాలి అనే అంశాలపై సలహాలు, సూచనలు ఇస్తారు. అంతే కాదు నిర్మాణం పూర్తయ్యేంత వరకు అందుబాటులో ఉంటారు.

అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ మాల్స్‌లో తప్పనిసరి



ఈ యేడాది మార్చిలో అపార్ట్‌మెంట్లు, మాల్స్‌లో బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో ట్యాంకర్ల డిమాండ్ పెరిగింది. అవసరం మేరకు ట్యాంకర్లను సరఫరా చేసినప్పటికీ బోర్ల రీచార్జిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో పెద్ద నిర్మాణాల్లో ఇంకుడు గుంతలను సిద్ధం చేసుకోవాలని చెబుతున్నాం. ఇరిగేషన్ అధికారులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఎవరికైనా అవసరమైతే టెక్నీషియన్‌ను ఉచితంగా పంపించేలా ఏర్పాట్లు చేశాం. భవిష్యత్తు అవసరాల నిమిత్తం ప్రతీ ఒక్కరు ఇళ్ల వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతలు తవ్విస్తే మేలు.

● హరిశంకర్, ఎస్ఆర్‌నగర్ జలమండలి జీఎం

డ్రైనేజీ పైప్‌లైన్ ఆధునికీకరణ : పొన్నం


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం, ఎంపీ, మేయర్‌తోపాటు కాంగ్రెస్ నేతలు

యూసుఫ్‌గూడ, మే 17 (ఆంధ్రజ్యోతి): పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం కృష్ణానగర్ సి బ్లాక్ కమ్యూనిటీహాల్ నుంచి పోచమ్మ ఆలయం వరకు సుమారు రూ.75 లక్షల నిధులతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మీతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అజారుద్దీన్, నవీన్ యాదవ్, అసదుద్దీన్, ఫెరోజ్‌ఖాన్, రాము, కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు.


ఉత్పత్తులను పరిశీలిస్తున్న మోడల్స్

మొదలైన సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడి పెరుగుతోంది. మరోవైపు శుభకార్యాలు, వివాహాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో వదులుగా ఉండి చల్లదనం పంచడంతోపాటు ఫ్యాషనబుల్‌గా ఉండే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలు మొగ్గు చూపిస్తుంటారు. ఈ నేపథ్యంలో శ్రీనగర్‌కాలనీ సత్యసాయినిగమాగమంలో శనివారం ఒడిస్సా ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఆధ్వర్యంలో సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన మొదలైంది. మోడల్స్ ఉత్పత్తులను చూస్తూ సందడి చేశారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాళ్లలో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన మే 25 వరకు కొనసాగుతుందని నిర్వాహకుడు మానస ఆచార్య తెలిపారు.

'మంత్రుల అవినీతిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం'



విలేకరుల సమావేశంలో దిలీప్‌కుమార్ తదితరులు

ఖైరతాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న తెలంగాణలో పది సంవత్సరాలు గుంట నక్కలు పాలిస్తే ప్రస్తుతం తోడేళ్లు పాలిస్తున్నాయని తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్(టీఆర్ఎల్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్ ఆరోపించారు. శనివారం సోమాజిగుడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రిలోక్ త్యాగి తదితరులతో కలిసి మాట్లాడారు. స్వయానా ఒక మంత్రి ఇతర మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని పేర్కొన్నందున కమీషన్లు తీసుకుంటున్న మంత్రులను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తాము గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. బిల్లులు పాస్ చేయాలంటే ఓపెన్‌గా కమీషన్లు తీసుకుంటున్నారని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఒక శాఖను ముఖ్యమంత్రే తన వద్ద ఉంచుకొని ఫైల్స్ మొత్తం తనకే పంపాలని ఆదేశిస్తున్నట్లు ఆరోపించారని తెలిపారు. త్రిలోక్ త్యాగి మాట్లాడుతూ తమ పార్టీ తెలంగాణలో బలపడేందుకు కృషి చేసున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వసతులు, రైతులను రాజులుగా చేయడంతోపాటు పిల్లలకు విలువైన విద్య అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఎన్నికల పిటిషన్ తిరస్కరించడం కుదరదు

- మాగంటి గోపీనాథ్ అప్లికేషన్ కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): విచారించదగిన అంశాలు ఉన్న ఎలక్షన్ పిటిషన్‌ను ఏకపక్షంగా తిరస్కరించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా తన ఎన్నికను సవాల్ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ అజారుద్దీన్ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌ను తిరస్కరించాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అప్లికేషన్ దాఖలు చేశారు. ఈ అప్లికేషన్‌ను హైకోర్టు కొట్టేసింది. పిటిషన్‌లో ట్రయల్ చేయాల్సిన అంశాలు ఉన్న నేపథ్యంలో ప్రాథమిక దశలోనే తిరస్కరించలేమని జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు అజారుద్దీన్ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై విచారణ కొనసాగించనుంది.

రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి

- డాక్టర్ రమాకుమారి

హైటెక్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) కార్డియాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రమాకుమారి సూచించారు. ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా శనివారం నిమ్స్ ఆస్పత్రిలో రక్తపోటు నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిమ్స్ అత్యవసర విభాగం నుంచి ప్రధాన గేటు వరకు నిర్వహించిన ర్యాలీలో వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, కాలేజ్ ఆఫ్ అలైడ్ హెల్త్ సైన్సెస్, ఫిజియోథెరపీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమాకుమారి మాట్లాడుతూ మాంసాహారం నియంత్రించి, శాఖాహారం తీసుకోవాలని, ఉప్పును తక్కువ మోతాదులో వినియోగించాలని అన్నారు. ర్యాలీలో నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, టెక్నికల్ అధికారులు శ్రీనివాస్‌బాబు, ఓంప్రకాశ్, మధుకుమార్, ఎం.శ్రీనివాస్, ఆర్య, నర్సింగ్ కళాశాల సిబ్బంది పద్మావతి, చంద్రకళ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది, విద్యార్థులు

యూనిఫాంలు అందజేత

బోరబండ, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలను ఖైరతాబాద్ ఎంఈఓ శరవణన్‌కుమార్‌కు జీహెచ్ఎంసీ సర్కిల్-19 డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు శనివారం అందజేశారు. శ్రీరామ్‌నగర్‌లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏలోని మహిళా ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న రొమ్ము క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ శిబిరం ముగిసింది. అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్‌లో గల హెచ్ఎండీఏ కార్యాలయంలో కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో మూడు రోజులుగా వైద్య పరీక్షలు చేస్తున్నారు. శనివారం కిమ్స్ ఆస్పత్రిలోని కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ స్నేహ ఆధ్వర్యంలోని వైద్యబృందం మహిళా ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేశారు. రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడంపై అవగాహన కల్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

గోమేధానికి నిరసనగా జూన్ 7న బ్లాక్ డే

పంజాగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): చార్మినార్ సాక్షిగా జరుగుతున్న గోమేధానికి నిరసనగా బక్రీద్ సందర్భంగా జూన్ 7ను బ్లాక్‌డేగా ప్రకటిస్తున్నామని యుగ తులసి ఫౌండేషన్ ఛైర్మన్ కె.శివకుమార్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చంద్రస్వామి, కె.శ్రీనివాస్, ఆంజనేయులుతో కలిసి ఆయన మాట్లాడారు. గోవులను కాపాడాలని, అక్రమంగా తరలించకుండా ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన

రాంగోపాల్‌పేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో హెల్త్‌కేర్ బిల్లింగ్ ఎగ్జికూటివ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్ అసిస్టెంట్)గా ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడి స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 8247255859, 8019816641లో సంప్రదించాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

మినీ అంగన్వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

పంజాగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మినీ అంగన్వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, 12 నెలల జీతం బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర మినీ అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు రేణుక, ఝాన్సీ, లక్ష్మి, శ్రీలత, వెంకటరమణ, లక్ష్మీబాయి, రమాదేవి, శివమ్మ, మల్లిక, కొమురమ్మ, రామతార తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడికి పరామర్శ

బోరబండ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామిని బ్రహ్మశంకర్‌నగర్‌లోని అతడి నివాసంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట రాజ్యసభసభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, అజారుద్దీన్, కార్పొరేటర్లు సి.ఎన్.రెడ్డి, ఎం.డి.బాబాఫసియుద్దీన్ ఉన్నారు.

ఉస్మానియా ఆస్పత్రిలో పెయిన్ క్లినిక్ ప్రారంభం



పెయిన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో పెయిన్ క్లినిక్‌ను డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నొప్పి నివారణకు అధునాతన, మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని తెలిపారు. ప్రవాస భారతీయ వైద్యులు, సహ దాతల సహకారంతో ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహే తదితరులు పాల్గొన్నారు.



రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ చేసిన పిల్లలతో నిమ్స్ వైద్య బృందం

నిమ్స్‌లో ఇద్దరు బాలురకు అరుదైన చికిత్స

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్రజ్యోతి): గుండె దడతో వచ్చిన ఇద్దరు బాలురకు నిమ్స్ వైద్యులు అరుదైన చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. ఇద్దరు బాలురకు సుప్రావెంట్రిక్యులర్ అరిథ్మియాలకు సంక్లిష్ట రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ (ఆర్ఎఫ్ఏ) ప్రక్రియను నిర్వహించినట్లు వివరించారు. వివరాలను నిమ్స్ సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఓరుగంటి సాయి సతీష్ వివరించారు. ఖమ్మంకు చెందిన 15 ఏళ్ల బాలుడు చిన్నప్పటి నుంచి తరుచూ దడతో ఇబ్బంది పడుతున్నాడు. ఆ బాలుడిని ఇటీవల నిమ్స్‌కు తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అతనికి కుడి వైపు గుండె ఉన్నట్లు, థొరాక్స్, ఉదరంలోని ప్రధాన అవయవాలు వ్యతిరేక దిశలో ఉన్నట్లు గుర్తించారు. వక్రీకరించిన గుండె శరీర నిర్మాణ శాస్త్రం, చిన్న వయసు, కాథెటర్లను ఉంచడంలో ఇబ్బంది, దడకు కారణమయ్యే అసాధారణ బహుళ విద్యుత్ సర్క్యూట్ల వివరణ సవాళ్లను 3డీ ఈ మ్యాపింగ్ సహాయంతో అధిగమించారు. వక్రీభవన దడకు కారణమయ్యే మరొక సర్క్యూట్‌తో పాటు అసాధారణ అదనపు విద్యుత్ మార్గం ఆర్ఎఫ్ శక్తితో విజయవంతంగా తొలగించినట్లు ఆయన వివరించారు.

నాలుగు నెలల్లో 25 సార్లు గుండె దడ

నగరానికి చెందిన మరో 14 ఏళ్ల బాలుడు నాలుగు నెలల్లో 25 సార్లకు పైగా గుండె దడతో అస్వస్థతకు గురయ్యాడు. పలు ఆస్పత్రులను సందర్శించిన తర్వాత అతను ఇటీవల నిమ్స్‌కు వచ్చాడు. ఆ బాలుడిని పరీక్షించిన వైద్యులు మిట్రల్ వాల్వ్ దగ్గర గుండె ఎడమ వైపు అసాధారణమైన అదనపు విద్యుత్ ఉత్పత్తి చేసే సమస్య ఉన్నట్లు గుర్తించారు. దీనిని 3డీ మ్యాపింగ్ సహాయంతో, దృష్టి రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్‌తో తొలగించినట్లు చెప్పారు. ప్రక్రియ తర్వాత ఇద్దరు బాలురు గుండె దడ నుంచి పూర్తిగా విముక్తి పొందారని, ఈ వైద్య ప్రక్రియ ఉచితంగా నిర్వహించామని డాక్టర్ సాయి సతీష్ తెలిపారు. ఈ వైద్య ప్రక్రియలో డాక్టర్ హేమంత్, డాక్టర్ సునీత, డాక్టర్ అజేయ, డాక్టర్ మౌనిక, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అనురాగ్, క్యాత్ ల్యాబ్ టెక్నీషియన్లు ప్రమీల, రామారావు, నర్సింగ్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ ఉన్నారు.

కిమ్స్‌లో 35ఏళ్ల మహిళకు..



కోలుకున్న మహిళతో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు

రాయదుర్గం, మే 17 (ఆంధ్రజ్యోతి): థైరాయిడ్ వాపు వల్ల గుండె, ఊపిరితిత్తులు, ప్రధాన రక్తనాళాలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న 35ఏళ్ల మహిళకు కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. కిమ్స్ ఆస్పత్రి థొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. 35ఏళ్ల మహిళ ఊపిరి అందక ఇబ్బంది పడుతుండడంతో కుటుంబసభ్యులు ఇటీవల కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారని తెలిపారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమెకు చాలా కాలంగా థైరాయిడ్ వాపు సమస్య ఉందని, అది క్రమంగా మెడ నుంచి కిందకి వెళ్లి ఎద భాగాన్ని ఆక్రమించిందని గుర్తించామని తెలిపారు. కుడివైపు ఊపిరితిత్తులు, గుండె, ప్రధాన రక్తనాళాన్ని ఆక్రమిస్తూ రెట్రోస్టెర్నల్ గాయిటర్‌గా రూపొందిందని గుర్తించామని ఆయన పేర్కొన్నారు. అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నైపుణ్యంతో 15సెంటీమీటర్ల పొడవున్న కణితిని తొలగించామని వివరంచారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని వారం రోజుల తర్వాత డిచార్జ్ చేసినట్లు ఆయన తెలిపారు.

వైద్య చికిత్సలో అల్ట్రాసౌండ్ కీలకం



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మే 17 (ఆంధ్ర జ్యోతి): అత్యవసర వైద్య చికిత్సలో అల్ట్రాసౌండ్ పరికరం కీలకంగా మారిందని కేర్ హాస్పిటల్స్ అసోసియేట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్ వర్మ కె పేర్కొన్నారు. కేర్ ఆస్పత్రి బంజారాహిల్స్ ఆధ్వర్యంలో, సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా (ఎస్ఈఎంఐ) ఆధ్వర్యంలో శనివారం జాతీయ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్ (ఎన్‌యూఎల్ఎస్) వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ లైఫ్ సపోర్ట్‌పై వైద్యులకు శిక్షణ ఇస్తున్నామని, దీని వల్ల వారిలో నైపుణ్యం పెరుగుతుందని వివరించారు. సెమీ అకడమిక్ చెయిర్ డాక్టర్ శ్రీనత్ కుమార్ టీఎస్ మాట్లాడారు. ట్రామా, కార్డియాక్ అరెస్ట్, షాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్లను త్వరగా అంచనా వేసేందుకు అవసరమైన అల్ట్రాసౌండ్ సాంకేతికతలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో సెమీ బోర్డు అధ్యక్షురాలు డాక్టర్ సౌజన్య పట్టిబండ్ల, దేశవ్యాప్తంగా ఉన్న ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వార్డులో రోగులకు తిరిగే స్వేచ్ఛ

- జైలు శాఖ నియంత్రణలో ఖైదీ రోగులకు భద్రత
- మానసిక చికిత్సాలయం సూపరింటెండెంట్ డాక్టర్ అనిత

హైదరాబాద్ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): మానసిక చికిత్సాలయంలో కుటుంబ వార్డులలోని రోగులకు స్వేచ్ఛగా తిరిగే హక్కు ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు. కొన్నిసార్లు వారు ఆస్పత్రి ప్రాంగణాన్ని వదిలివెళ్తారని, ఆ సమయంలో రోగులు కుటుంబసభ్యుల కస్టడీ నుంచి తప్పించుకుంటారని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురించిన 'మానసిక చికిత్సాలయం నుంచి నిత్యం రోగులు మాయం' కథనానికి ఆమె స్పందించారు. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 ప్రకారం, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు కనీస నియంత్రణతో చికిత్స చేయాలని, అందుకే, కుటుంబ వార్డుల వ్యవస్థ ఉందన్నారు. ఇక్కడ కుటుంబసభ్యులు రోగిని జాగ్రత్తగా చూసుకోవడానికి వారితో పాటు ఉండటానికి అనుమతిస్తారని తెలిపారు. జైలు రోగుల కోసం ప్రత్యేకంగా ఒక భవనం ఉందని, వారి పర్యవేక్షణ, భద్రత జైలు శాఖ నియంత్రణలో ఉంటుందని వివరించారు. దూకుడుగా ఉండే రోగులను, న్యాయాధికారులు, పోలీసులు సూచించిన రోగులను మాత్రమే క్లోజ్ వార్డులో ఉంచుతామని ఆమె తెలిపారు.





స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతున్న పిల్లలు, పెద్దలు

ఉల్లాసంగా..

వేసవిలో చిన్నారులకు ఆటవిడుపు

రాంగోపాల్‌పేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు ఎండలు మండిపోతున్నాయి. వేసవి సెలవులతో చిన్నారుల అల్లరికి హద్దు లేకుండా పోతుంది. వారి అల్లరికి అడ్డుకట్ట వేయడానికా అన్నట్లు వేసవి శిక్షణా శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నగరవాసులకు వేసవిలో ఆహ్లాదభరితంగా గడపడానికి ఉన్న స్విమ్మింగ్ కేంద్రాల్లో ఒకటి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని బీవీ గురుమూర్తి స్విమ్మింగ్ పూల్. ఇలాంటి ఈత కొలను వేసవిలో విద్యార్థులకు, పెద్దలకు వేసవి తాపాన్ని తగ్గించడానికి కృషి చేస్తోంది. వేసవి సెలవుల సమయంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఈత కొలనుకు వచ్చి శిక్షణను పొందడమే కాక, వేసవి తాపాన్ని తగ్గించుకుంటూ తమ సరదాను తీర్చుకుంటున్నారు.

సమయం

బాలురు: ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు
బాలికలు: మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు

ఈత నేర్చుకోవాలనుకునే ఔత్సాహికులు అడ్మిషన్‌కై ఎంబీబీఎస్ డాక్టర్ ఇచ్చే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో స్పోర్ట్స్.జీహెచ్ఎంసీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుము అడ్మిషన్ ఫీసుతో కలిపి రూ.510 కాగా ప్రతినెలా రూ.500 ఫీజు ఉంటుంది.

ఎంతో హాయిగా ఉంది



వేసవి సెలవుల్లో ఇంటిలో ఉంటే బోర్ కొడుతుంది. సెలవు దినాల్లో ఏదో ఒకటి నేర్చుకోవాలని ఉద్దేశంతో ఇక్కడ స్విమ్మింగ్ నేర్చుకుంటున్నాం. కోచ్‌లు ఎంతో స్నేహపూర్వకంగా స్విమ్మింగ్ నేర్పిస్తున్నారు. స్విమ్మింగ్ నేర్చుకుని పెద్దవాడినయ్యాక స్విమ్మింగ్ పోటీలకు కూడా వెళతాను.

- గౌతమ్ నందా, 3వ తరగతి విద్యార్థి

శ్రద్ధగా నేర్పిస్తారు



ఈ స్విమ్మింగ్ పూల్‌లో కోచ్‌లు ఎంతో శ్రద్ధగా ఈత నేర్చుకోవాలని వచ్చే వారికి నేర్పిస్తారు. ప్రతి కోచ్‌కు సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్‌లపై అవగాహన ఉంటుంది. స్విమ్మింగ్ నేర్చుకోవడానికి వచ్చేవారికి ఏవైనా ఇన్‌ఫెక్షన్లు, చర్మవ్యాధులు ఉన్నా వారిని పూల్‌లోకి దిగనివ్వరు. ప్రతి ఒక్కరూ స్విమ్మింగ్ కాస్ట్యూమ్స్, స్విమ్మిం గ్ క్యాప్స్ తప్పని సరిగా ధరించాలి.

- సదానంద్, పూల్ సూపర్‌వైజర్

తిరుగులేని శక్తిగా భారత్



తిరంగా ర్యాలీకి బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న పి.ఎల్.శ్రీనివాస్

సికింద్రాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నేతృత్వంలో భారత్ ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా రూపొందుతున్నదని బీజేపీ రాష్ట్ర నాయకులు, ఆర్‌జేఆర్ సిద్ధాంతి కళాశాల, అక్షర వాగ్దేవి పాఠశాల వ్యవస్థాపకులు పి.ఎల్.శ్రీనివాస్ అన్నారు. శనివారం ట్యాంక్‌బండ్ నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీకి విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా ఊపి బస్సును ఆయన ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న తీవ్రవాదులకు, పాక్ పాలకులకు తగిన గుణపాఠం చెప్పడం ద్వారా అటు దేశ ప్రతిష్ఠ, ఇటు మోదీ సమర్థవంత నాయకత్వం ప్రపంచానికి మరోసారి స్పష్టమైందని వెల్లడించారు. అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేస్తున్న మోదీ నాయకత్వంలో త్వరలోనే భారత్ అగ్రగామిగా తయారవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వనజ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమంగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులను ఆయన సత్కరించారు.

తిరంగా ర్యాలీకి బీజేపీ నేతలు



సీతాఫల్‌మండి చౌరస్తా నుంచి తిరంగా ర్యాలీకి బయలుదేరుతున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్, మే 17(ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్ వద్ద సిటిజనల్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన తిరంగా ర్యాలీకి సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ నేతలు తరలివెళ్లారు. సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం నుంచి బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో నాయకులు కనకట్ల హరి, నరేష్, కీర్తి, అంబాల రాజేశ్వరరావు, ఆకారం రమేష్, హన్మంతుముదిరాజ్, ముఠాగణేష్, శోభారాణి తదితరులు జాతీయ జెండాలను పట్టుకుని ద్విచక్ర వాహనాలపై వెళ్లారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు

సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలి

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్ని సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుల్ల పద్మారావుగౌడ్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పేద ప్రజల అవసరాలను గుర్తించి షాదీముబారక్, కల్యాణలక్ష్మీ, వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. శనివారం సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ఐదు డివిజన్లకు చెందిన సుమారు 255మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి సంబంధించిన హామీలను నెరవేర్చాలన్నారు. సీఎం హోదాలోని వ్యక్తి ప్రభుత్వం వద్ద నిధులు లేవని పేర్కొనడం సరికాదన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ప్రజలకు తాము అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మారేడుపల్లి, ముషీరాబాద్ మండల తహసీల్దార్లు భీమయ్యగౌడ్, రాణాప్రతాప్ సింగ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, ప్రసన్నలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

పద్మారావునగర్, మే 17(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం బన్సీలాల్‌పేట డివిజన్‌లోని జీవైఆర్ కాంపౌండ్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయంలో వివిధ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అక్కడే ఉన్న డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ డాకు నాయక్‌ను, నీటి సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ జీఎం వినోద్‌ను ఆదేశించారు. అదేవిధంగా లిఫ్ట్, పారిశుధ్య, సీసీ కెమెరాలు, పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్థానికులైన అర్హులకు మాత్రమే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బస్తీ పిల్లలు క్రికెట్ కిట్ అడగగా వెంటనే తెప్పించి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ ఆంజనేయులు, డీఈ వెంకటేష్, ఏఈ కృష్ణ, హార్టికల్చర్ అధికారి విశాల్, ఏఈ సాగర్, బస్తీ అధ్యక్షుడు వెంకట్‌బాబు, డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో ఆగిన కారు.. మహిళకు సహకారం



అభిషేక్‌ను గుడ్ సమరిటన్‌గా గుర్తించి అభినందిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు, గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, మే 17(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ మధ్యలో చిక్కుకుపోయిన మహిళకు సహకారం అందించిన గూగుల్ ఉద్యోగిని గుడ్ సమరిటన్‌గా గుర్తించారు. సిటీ ట్రాఫిక్ పోలీసులు అతడిని ట్రాఫిక్-1 ఏసీపీ శనివారం అభినందించారు. ఏసీపీ శంకర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మే 16న రాత్రి 8:15కు సికింద్రాబాద్ వైఎంసీఏ ఫ్లైఓవర్ మధ్యలో ఓ కారు బ్యాటరీ డౌన్ అయి ట్రాఫిక్‌లో నిలిచిపోయింది. 55 ఏళ్ల మహిళ కారును నడుపుతోంది. కారు ఒక్కసారిగా ట్రాఫిక్ మధ్యలో నిలిచిపోవడంతో ఆమె ఏటూ తోచక నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. అదే సమయంలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న గూగుల్ ఉద్యోగి అభిషేక్ బాధిత మహిళ పరిస్థితిని గుర్తించాడు. వెంటనే బైక్ పక్కకు ఆపి ఆమెకు సహాయం చేశాడు. కారును ఫ్లైఓవర్ నుంచి నార్త్‌జోన్ కార్యాలయం వైపుకు సురక్షితంగా తోసి ఆమెకు రక్షణగా నిలవడంతో పాటు.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసి సామాజిక బాధ్యత గల పౌరుడిగా ప్రవర్తించాడు. ఆ తర్వాత తన వాహనంపై వెళ్లిపోయాడు.

విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, ఎస్సై సతీష్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్‌లు అభిషేక్‌ను గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిచి అభినందించారు. పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ప్రతిఒక్కరూ అభిషేక్‌ను ఆదర్శంగా తీసుకొని సామాజిక బాధ్యతతో మెలగాలని, ఆపత్కాలంలో ఇతరులకు సహకరించాలని ఏసీపీ కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన

రాంగోపాల్‌పేట్, మే 17(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులకు కిమ్స్ ఫౌండేషన్, రిసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య రంగంలో హెల్త్‌కేర్ బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్ అసిస్టెంట్)గా ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలను కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ మూడు నెలలు ఉంటుందని, దీనికి 18 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఇంటర్ బైపీసీ చదివిన వారికి బీఎస్సీ పారామెడికల్ కాలేజ్‌లో అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో నూతన బ్యాచ్ ప్రారంభం కాబోతుందని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ అర్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో సికింద్రాబాద్ ప్యారడైజ్ పక్కన గల కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి క్యాంపస్‌లోని 4వ అంతస్తులోని కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్, టెక్ మహేంద్ర ఫౌండేషన్ స్మార్ట్ సెంటర్‌లో లేదా ఫోన్ నం.8247255859, 8019816641లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

నేరేడ్‌మెట్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో ఎక్కువ సేపు మాట్లాడవద్దని చదువు ప్రాధాన్యత ఇవ్వాలని తండ్రి మందలించడంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగలి శివరాం కుమారుడు పాపయ్య(16) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పాపయ్య ఎక్కువ సేపు ఫోన్‌లో గడుపుతుండడంతో తండ్రి మందలించి బాగా చదువుకోవాలన్నాడు. పాపయ్య అదే విధంగా ఫోన్‌లో ఎక్కువసేపు గడుపుతుండడంతో తండ్రి పాపయ్యతో మాట్లాడటం మానేశాడు. దీంతో మనస్తాపం చెందిన పాపయ్య ఈనెల 16న సాయంత్రం ఉరి వేసుకొని చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూగబోయిన క్లాక్‌టవర్



పని చేయని క్లాక్‌టవర్ గడియారం

రెజిమెంటల్‌బజార్, మే 17(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక క్లాక్ టవర్ ఆకస్మాత్తుగా ఆగిపోయింది. సమయాన్ని తెలియజేస్తూ గంట గంటకు మోగాల్సిన 'క్లాక్ టవర్' మూగ బోయింది. సికింద్రాబాద్ క్లాక్‌టవర్‌లో ఉన్న గడియారం కొన్ని రోజులుగా పనిచేయడం లేదు. నిర్వాహణ బిల్ రావడం లేదని గుత్తేదారు దానిని పట్టించుకోవడం లేదు. దాంతో ఎంతో చరిత్ర ఉన్న క్లాక్ టవర్‌ను ఇలా గాలికి వదిలేయడం మంచిది కాదని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేసి పనిచేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హమ్మయ్య.. నీళ్లు వచ్చేశాయ్



మంచినీటి ప్లాంట్‌లో నీళ్లు పట్టుకున్న రోగుల సహాయకులు

అడ్డగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రి వాటర్ ప్లాంట్‌లో నీరు రావడంలేదు, వాటర్ ప్లాంట్ ఒకే ...నీళ్లేవి? అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి స్పందించి వాటర్ ప్లాం ట్‌కు మరమత్తులు చేయించి తాగునీటికి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఆర్వో వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌లో అంతరాయం ఏర్పడడంతో ఈ ఇబ్బంది ఏర్పడిందని కొందరు వైద్యులు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితం కావడతో ఉదయాన్నే ప్లాంట్ టెక్నీషియన్ మరమత్తులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. దాంతో రోగులు సహాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

స్పెషల్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



జి శశికళ, అధ్యక్షురాలు



ఎస్. నీలిమ ప్రధాన కార్యదర్శి

అడ్డగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని హైదరాబాద్‌లో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గజ్జెల శశికళ, ఉపాధ్యక్షురాలిగా ఎన్. వెంకటేశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శి శెట్టి నీలిమ, ఉప కార్యదర్శిగా గుమస్తా వైశాలి, జిల్లా కోశాధికారిగా బొర్ర నరేష్ కుమార్, కార్యనిర్వాహక సభ్యులుగా విధాన్ ఉమాదేవి, వలబోజు సంధ్యారాణి, సత్యవేణి, రాజీవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఈ సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షురాలు గజ్జెల శశికళ మాట్లాడుతూ జిల్లాలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేక సమ్మిళితీకృత విద్య విధానాన్ని పటిష్టపర్చడానికి కృషి చేస్తానన్నారు.



మాస్టర్ నందన దైవిక్‌కు జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న వెంకటాచారి తదితరులు

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మాస్టర్ నందన దైవిక్

తార్నాక, మే 17 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లికి చెందిన మాస్టర్ నందన దైవిక్ పచ్చిగోళ్ల 10 సంవత్సరాల వయసులో రెండు విభిన్న కథ, సాహిత్యం శైలిలో పుస్తకాలు రాసి, ప్రచురించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. శనివారం లాలాపేటలోని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. చింతపట్ల వెంకటాచారి మాస్టర్ నందన దైవిక్‌కు జ్ఞాపికతో పాటు, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ నందన దైవిక్ పిన్న వయసులో మిస్టరీ ఆఫ్ ది మిస్సింగ్ జ్యువెల్స్, ఫై రైమ్ మ్యాజిక్ అనే పేరుతో రెండు పుస్తకాలను రాసి, ప్రచురించి తన సాహిత్య ప్రతిభను చాటుకున్నందుకు గాను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించినట్లు తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం



వెంకటేశ్వరమ్మ

అడ్డగుట్ట, మే 17 (ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం వచ్చిన ఓ వృద్ధురాలు సికింద్రాబాద్‌లో అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం ఆదిబట్ల ప్రాంతానికి చెందిన శవనం వెంకటేశ్వరమ్మ (65) మతిస్థిమితం లేకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం కృష్ణారెడ్డి, ఆమె సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాండులో శనివారం దిగారు. ఆ సమయంలో వెంకటేశ్వరమ్మకు జ్వరంగా ఉండడంతో కృష్ణారెడ్డి మందులు తెస్తానని వృద్ధురాలిని బస్టాండులో ఉండమని చెప్పి మందుల కోసం కృష్ణారెడ్డి బయటకు వెళ్లాడు. మందులు తీసుకొని వచ్చిన అతడికి వృద్ధురాలు కనిపించకపోవడంతో ఆ ప్రాంతమంతా గాలించాడు. బంధువులు, స్నేహితుల్లో వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో ఈదబు గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.